# కరెంట్ అఫైర్స్

1. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రాయితీల సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాల్లో బదలాయించడానికి ఆధార్ వివరాలు సమర్పించే గడువును కేంద్ర ప్రభుత్వం ఎప్పటివరకు పెంచింది? (గతంలో ప్రకటించిన ప్రకారమైతే ఈ గడువు 2018, మార్చి 31తో ముగిసింది. బ్యాంకు ఖాతాలు, చరవాణులను ఆధార్‌తో అనుసంధానించుకునే గడువును నిరవధికంగా పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఇటీవలే ఆదేశాలిచ్చింది.)

   1) 2018, ఏప్రిల్ 30 2) 2018, మే 31
   3) 2018, జూన్ 30 4) 2018, జులై 31

2. 2018, మార్చి 28న విన్ మ్యింట్ ఏ దేశానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు? (హితిన్ క్యా స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు.)

   1) మయన్మార్ 2) ఇండోనేసియా 3) మాల్దీవులు 4) బంగ్లాదేశ్

3. 2018, మార్చి 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఏ దేశంలో రహస్యంగా పర్యటించినట్లు వెల్లడైంది? (ఉత్తర కొరియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కిమ్ విదేశాలకు వెళ్లడం ఇదే మొదటిసారి.)

   1) జపాన్ 2) చైనా 3) అమెరికా 4) దక్షిణ కొరియా

4. మహారాష్ట్రలోని కరవు పీడిత ప్రాంతాల కోసం 'శ్రమదాన్' పేరిట ఉద్యమాన్ని ప్రారంభించిన బాలీవుడ్ నటుడు ఎవరు?

   1) అమితాబ్‌బచ్చన్ 2) షారూక్‌ఖాన్ 3) సల్మాన్‌ఖాన్ 4) అమీర్‌ఖాన్

5. 2018, మార్చి 27న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కీర్తిచక్ర పురస్కారాన్ని ఎవరికి ప్రదానం చేశారు?

   1) మేజర్ డేవిడ్ మన్లూన్ (మరణానంతరం)
   2) మేజర్ విజయంత్ బిష్త్
   3) సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ చేతన్ కుమార్ చీటా
   4) పై ముగ్గురూ

6. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జాతీయ ఆరోగ్య భద్రతా పథకం 'ఆయుష్మాన్ భారత్' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎవరు నియమితులయ్యారు? (ఈయన ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన ఆసియా అభివృద్ధి బ్యాంకు – (ఏడీబీ) తూర్పు ఆసియా విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.)

   1) నవనీత్‌సింగ్ 2) కృష్ణ కశ్యప్
   3) ఇందు భూషణ్ 4) సుదీప్ లోహియా

7. 2018, మార్చి 26న ఏ దేశంలోని కెమెరోవో నగరంలోని వింటర్ చెర్రీ షాపింగ్‌మాల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో బడిపిల్లలు సహా 64 మంది సజీవ దహనమయ్యారు?

   1) ఆస్ట్రేలియా 2) ఫ్రాన్స్ 3) రష్యా 4) జర్మనీ

8. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను ఉరి తీసిన 87 ఏళ్ల తర్వాత తొలిసారిగా దానికి సంబంధించిన కొన్ని దస్త్రాలను ఏ దేశ ప్రభుత్వం 2018, మార్చి 26న ప్రదర్శనగా అందుబాటులోకి తెచ్చింది? (బ్రిటిష్ పోలీస్ అధికారి శాండర్స్‌ను హతమార్చినందుకు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను 1931, మార్చి 23న లాహోర్‌లో ఉరి తీశారు.)

   1) బ్రిటన్ 2) పాకిస్థాన్ 3) ఇండియా 4) సింగపూర్

9. ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2018 క్వాలిఫయర్ టోర్నీలో ఏ జట్టు విజేతగా నిలిచింది? (విజేతగా నిలిచిన జట్టుతో పాటు వెస్టిండీస్ జట్టు కూడా 2018 వన్డే ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది.)

   1) జింబాబ్వే 2) అఫ్ఘనిస్థాన్ 3) స్కాట్లాండ్ 4) ఐర్లాండ్

**10.** తుపాకుల సంస్కృతిని నిరసిస్తూ 2018 మార్చిలో ఏ దేశంలోని యువత దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు?

1) ఉత్తర కొరియా 2) ఇరాన్ 3) ఫ్రాన్స్ 4) అమెరికా

**11.** 'వరల్డ్ ఎర్త్ అవర్'ను 2018లో ఏ రోజున నిర్వహించారు? (ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజున రాత్రి 8 : 30 నుంచి 9 : 30 మధ్య దేశ, విదేశాల్లోని ప్రముఖ కట్టడాల వద్ద విద్యుత్ దీపాలను ఆర్పివేశారు.)

1) మార్చి 10 2) మార్చి 17 3) మార్చి 24 4) మార్చి 31

**12.** 2018, మార్చి 22 నుంచి అయిదు రోజుల పాటు భారత్‌లో పర్యటించిన జర్మనీ అధ్యక్షుడెవరు?

1) కాన్‌స్టాంటినో చివెంగా 2) సొలోస్ క్లాస్ చిలీమా

3) ఎడ్వర్డ్ కివానుక స్సెకాండీ 4) ఫ్రాంక్ వాల్టర్ స్టీన్ మియర్

**13.** 2018 మార్చిలో రాజ్యసభ ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో భారతీయ జనతా పార్టీ ఎన్ని స్థానాలను గెలుచుకుంది? (రాజ్యసభలో ఏప్రిల్‌లో 58 స్థానాలు ఖాళీ అవుతుండగా అందులో 33 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 25 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.)

1) 10 2) 12 3) 14 4) 16

**14.** అమెరికా నూతన జాతీయ భద్రతా సలహాదారుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎవరిని నియమించారు. (ఈ పదవిలో ఉన్న లెఫ్టినెంట్ జనరల్ హెచ్‌ఆర్ మెక్ మాస్టర్‌కు ఉద్వాసన పలికిన ట్రంప్ ఈ నూతన నియామకం చేశారు.)

1) జాన్ బోల్టన్ 2) రెక్స్ టిల్లర్‌సన్

3) స్టీవ్ న్యూచిన్ 4) జేమ్స్ మ్యాటిస్

**15.** విదేశీ నైపుణ్య ఉద్యోగాలకు కీలకమైన '457 (సబ్‌క్లాజ్) కేటగిరీ వీసా'లను 2018 మార్చిలో ఏ దేశం రద్దు చేసింది? (దీని స్థానంలో 'టెంపరరీ స్కిల్ షార్టేజీ – టీఎస్ఎస్' వీసా విధానాన్ని ఈ దేశం తీసుకు వచ్చింది.)

1) అమెరికా 2) ఆస్ట్రేలియా 3) ఫ్రాన్స్ 4) జర్మనీ

**16.** ఆసియన్ మీడియా గ్రూప్ వెల్లడించిన గణాంకాల ప్రకారం యూకేలో నివసిస్తున్న బ్రిటిష్ ఆసియన్లలో వరుసగా అయిదో ఏడాది అత్యంత సంపన్న వ్యాపార కుటుంబంగా నిలిచింది?

1) మిత్తల్ కుటుంబం 2) లోహియా కుటుంబం

3) హిందుజా కుటుంబం 4) నారంగ్ కుటుంబం

**17.** చిత్తూరు జిల్లా సత్యవేడు శ్రీసిటీ సమీపంలోని మదనపాలెం వద్ద 636 ఎకరాల్లో నిర్మించబోయే హీరో మోటో కార్ప్ మొదటి దశ పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు శంకుస్థాపన చేశారు? (హీరో మోటో కార్ప్ ఛైర్మన్ పవన్ ముంజాల్, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి అమర్‌నాథ్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హీరో మోటో కార్ప్‌కు దక్షిణ భారతంలో ఇదే మొదటి యూనిట్, మొత్తం మీద 8వ యూనిట్.)

1) 2018, మార్చి 23 2) 2018, మార్చి 24

3) 2018, మార్చి 25 4) 2018, మార్చి 26

**18.** జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించి ఎన్నేళ్లు అయిన సందర్భంగా 2018, మార్చి 23న ఉత్సవ కార్యక్రమాన్ని జీఎంఆర్ గ్రూప్ నిర్వహించింది? (ఈ కార్యక్రమంలో భాగంగా విమానాశ్రయ విస్తరణ పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దక్షిణాసియాలోనే అతిపెద్ద సమావేశ మందిరాన్ని విమానాశ్రయ ప్రాంగణంలో నిర్మించాలని జీఎంఆర్ సంస్థ నిర్ణయించింది. ఈ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి అనుసంధాన కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రపంచ శ్రేణి కంపెనీలను ఆకర్షించడానికి దేశంలోనే తొలి ఎయిర్‌పోర్టు సిటీని అభివృద్ధి చేయడానికి జీఎంఆర్ శ్రీకారం చుట్టింది)

1) 10 2) 15 3) 20 4) 25

**19.** తెలంగాణలోని మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించారు. కిందివారిలో విజయం సాధించిన ఆ ముగ్గురిలో లేని వారిని గుర్తించండి. (ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. తెదేపా నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్, వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.)

1) బండా ప్రకాష్ ముదిరాజ్ 2) బడుగుల లింగయ్య యాదవ్

3) జోగినపల్లి సంతోష్‌కుమార్ 4) పోరిక బలరామ్

**20.** ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తున్న పారిశ్రామిక పన్ను ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటివరకు పొడిగించింది?

1) మార్చి 2020 2) మార్చి 2022 3) మార్చి 2023 4) మార్చి 2025

**21.** మెర్సర్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసి రూపొందించిన నివేదిక ప్రకారం దేశంలో నాణ్యమైన జీవనానికి అనువైన నగరాలుగా ఏ రెండు నగరాలు మొదటి స్థానాల్లో నిలిచాయి? (ప్రపంచ ర్యాంకింగ్‌లో ఆస్ట్రియా రాజధాని వియన్నా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో ఈ రెండు భారత నగరాలు 142వ స్థానంలో నిలిచాయి.)

1) బెంగళూరు, చెన్నై 2) ముంబై, దిల్లీ

3) కోల్‌కతా, లఖ్‌నవూ 4) హైదరాబాద్, పుణె

**22.** కల్యాణ లక్ష్మి (షాదీ ముబారక్) పథకం కింద ఆడపిల్ల పెళ్లి కోసం అందించే ఆర్థిక సహాయ మొత్తాన్ని రూ. 75,116 నుంచి ఎంతకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ప్రకటించారు? (2018, ఏప్రిల్ 1 తర్వాత వివాహం చేసుకునే ఆడ పిల్లలకు ఈ ఆర్థిక సాయం అందుతుంది.)

1) రూ. 80,116 2) రూ. 90,116 3) రూ. 1,00,116 4) రూ. 1,11,116

### జవాబులు

1-3; 2-1; 3-2; 4-4; 5-4; 6-3; 7-3; 8-2; 9-2; 10-4; 11-3; 12-4; 13-2; 14-1; 15-2; 16-3; 17-1; 18-1; 19-4; 20-1; 21-4; 22-3.

### రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి

- 2018, మార్చి 18న జరిగిన రష్యా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఘన విజయం సాధించారు.
- తాజా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌కు 76.67 శాతం ఓట్లు రాగా ఆయన సమీప ప్రత్యర్థి, కమ్యూనిస్టు పార్టీ నేత పావెల్ గ్రుడినిన్‌కు 11.79 శాతం ఓట్లు వచ్చాయి.
- తాజా విజయంతో 2024 వరకూ పుతిన్ రష్యా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. దీంతో నియంత జోసఫ్ స్టాలిన్ (24 ఏళ్లు) తర్వాత అత్యధిక కాలం రష్యాను పాలించిన నేతగా పుతిన్ రికార్డు సృష్టించనున్నారు.
- 2000 నుంచి 2008 వరకూ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పని చేసిన పుతిన్ ఆ తర్వాత నాలుగేళ్లు ప్రధానిగా ఉన్నారు. 2012లో మూడోసారి అధ్యక్ష పీఠం చేపట్టారు.

### జీఎస్ఎల్‌వీ - ఎఫ్08 ప్రయోగం

- 2018, మార్చి 29న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 08ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ – 6ఎ ను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా మోసుకెళ్లింది.
- జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 12వది. దీని బరువు 415.6 టన్నులు. పొడవు 49.1 మీటర్లు. దశలు మూడు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్08లో మొదటిదశ ఇంజిన్‌లో ద్రవ ఇంధనంతో నడిచే నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లు, మిశ్రమ ఘన ఇంధనంతో పని చేసే ప్రధాన ఇంజిన్ ఉంది. రెండో దశలో ద్రవ ఇంధనాన్ని ఉపయోగించారు. మూడో దశలో క్రయోజెనిక్ ఇంజిన్ ఉంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన చేసిన ఈ ఆరో క్రయోజెనిక్ ఇంజిన్‌ను రాకెట్ ప్రయోగానికి వినియోగించారు.

- జీఎస్ఎల్‌వీ – ఎఫ్08లో వికాస్ ఇంజిన్‌ను తొలిసారిగా వినియోగించారు. ఇది రెండో దశలో అధిక పీడనాన్ని ఇస్తోంది. దీని వల్ల పేలోడ్ సామర్థ్యం పెంచుకునే వీలుంది.
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జీశాట్ – 6 ఉపగ్రహాన్ని 2015 ఆగస్టులో కక్ష్యలో ప్రవేశపెట్టింది. మళ్లీ ఇప్పుడు జీఎస్ఎల్‌వీ – ఎఫ్08 ద్వారా జీశాట్ 6ఏ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. దీని బరువు 2140 కిలోలు. జీవితకాలం పదేళ్లు. దీనికి రూ. 270 కోట్లు ఖర్చు చేశారు.
- జీశాట్ 6A లోని మల్టీ బీమ్ కవరేజీ సౌకర్యం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల్లో మొబైల్ కమ్యూనికేషన్‌ను అందించనుంది. ఇందులో అయిదు స్పాట్ బీమ్‌లలో ఎస్ బ్యాండు, ఒక బీమ్‌లో సి బ్యాండు ఉన్నాయి. రక్షణ దళాలకు జీశాట్ 6ఏ ఉపగ్రహ సేవలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి

## ఇజ్రాయెల్‌కు విమాన సేవలు

ఇజ్రాయెల్‌కు తొలిసారిగా ఎయిర్ ఇండియా (ఏఐ) తన విమాన సేవలను ప్రారంభించింది. సౌదీ అరేబియా విధించిన దశాబ్దాల గగనతల నిషేధానికి ముగింపు పలుకుతూ ఆ దేశం మీదుగా ఏఐ విమానం ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ విమానాశ్రయానికి చేరుకుంది. మార్చి 22న దిల్లీలో బయల్దేరిన ఏఐ 139 విమానం ఒమన్, సౌదీ అరేబియా, జోర్డాన్ మీదుగా కేవలం 7.25 గంటల్లోనే గమ్యస్థానానికి చేరింది. ప్రతి మంగళ, గురు, ఆది వారాల్లో ఏఐ విమానం ఇజ్రాయెల్‌కు వెళ్తుందని ఎయిర్ ఇండియా సీఎండీ ప్రదీప్ ఖరోలా ప్రకటించారు.

- లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే 2018, మార్చి 23న దిల్లీలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను మార్చి 29న విరమించారు.
- దిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వద్ద దీక్ష చేస్తున్న హజారే వద్దకు కేంద్ర ప్రభుత్వ దూతలుగా వచ్చిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర షెకావత్ ఆయనతో నిరశన దీక్షను విరమింపజేశారు.
- 2011లో రామ్‌లీలా మైదాన్ వద్దే అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు.
- కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఏర్పాటు చేయాలంటూ హజారే ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారాలను సూచించిన స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలుచేయాలని కూడా హజారే కోరుతున్నారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net